క్లుప్తంగా

బీసీ సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



సుభాష్‌నగర్: హైదరాబాద్‌లోని హరిత టూరిజం ప్లాజాలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం ఆహిర్‌ను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయనను యెండల లక్ష్మీనారాయణ కోరారు.

పీసీసీ చీఫ్‌ను కలిసిన జిల్లా నేతలు



ఖలీల్‌వాడి: హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని మంగళవారం నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నగర అధ్యక్షుడు కేశ వేణు, సరూర్ నగర్ స్టేడియంలో జరిగిన యువ సంఘర్షణ సభలో యూత్ డిక్లరేషన్ సభ విజయవంతం కావడంతో శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజు, నాయకులు సయ్యద్ అష్రఫ్, తదితరులు పాల్గొన్నారు.

రికవరీ ఫోన్ల అందజేత



ఖలీల్‌వాడి: నగరంలోని దుబ్బ చౌరస్తా వద్ద నగరానికి చెందిన సాగర్, గౌతంనగర్‌కు చెందిన నర్సింగ్‌రావు సెల్‌ఫోన్‌లు వారం క్రితం పోయాయి. పోయిన మొబైల్ ఫోన్ల వివరాలను పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో ఎంట్రీ చేసి ట్రాక్ చేశారు. నిందితుల నుంచి ఫోన్లను రికవరీ చేసి బాధితులకు మంగళవారం అందజేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

చెక్కుల పంపిణీ



ధర్పల్లి: ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపాలనే సంకల్పంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టిందని జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన 50 మంది లబ్ధిదారులకు రూ.50 లక్షల విలువ గల చెక్కులను ఎంపీపీ సారిక హనుమంత్ రెడ్డితో కలిసి లబ్ధిదారులకు ఆయన చెక్కులను అందజేశారు. అనంతరం బాజిరెడ్డి జగన్ మాట్లాడారు. వైస్ ఎంపీపీ నవీన్, తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీడీవో నటరాజ్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ ఉన్నారు.

దివ్యాంగులకు బస్‌పాసులు..



జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని శుభోదయం పాఠశాలలో మంగళవారం దివ్యాంగులకు ఉచిత బస్‌పాసులను ఎంపీపీ కుంచాల విమల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్ర కళ, ఉపసర్పంచ్ జక్కం బాల్‌కిషన్, ఎంపీటీసీ సభ్యులు గడ్డం గంగారెడ్డి, తలారి మరియా సతీష్, మండల కో–ఆప్షన్ సభ్యుడు అక్బర్‌ఖాన్, ఎంపీడీవో లక్ష్మణ్, ఏపీఎం రవీందర్, ఆర్టీసీ ప్రతినిధి హనుమదాసు పాల్గొన్నారు.

చెరువు కబ్జా చేసిన వ్యక్తిపై కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని అర్సపల్లిలోగల రామ్మూర్తి చెరువు చుట్టూ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చైన్‌లింక్ ఫెన్సింగ్ చేయగా, దానిని తొలగించిన రహీంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్‌గౌడ్ తెలిపారు. రహీం శిఖంభూమికి ఫెన్సింగ్ తొలగించి పది ఫీట్లు ప్రభుత్వ భూమిలోకి ప్రవేశించి మళ్లీ ఫెన్సింగ్ చేసినట్లు అసిస్టెంట్ ఇంజనీర్ శంకర్ ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమించిన, డ్యామేజ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై చెప్పారు.

నష్టపోయిన వారిని ఆదుకుంటాం

- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- డిచ్‌పల్లి పరిధిలో బీభత్సం సృష్టించిన ఈదురుగాలులు



డిచ్‌పల్లి మండలంలో నష్టాన్ని పరిశీలిస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి: మండలంలోని దూసగాం, గొల్లమాట్ తండా, నడిమితండా, నక్కలగుట్ట తండా, బీబీపూర్ తండా తదితర గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం బలమైన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. అకాల వర్షం, ఈదురు గాలుల తాకిడికి పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. విషయం తెలుసుకున్న ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హుటాహుటిన తండాలను సందర్శించారు. అకాల వర్షాలు, ఈదురు గాలులకు జరిగిన పంట నష్టాన్ని డిచ్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాసరావుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. 15 రోజుల నుంచి అకాల వర్షాలకు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపుతారని తెలిపారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని, ప్రతి రైతుకు పంట నష్టం కింద రూ.10 వేలు ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. నాలుగు గ్రామాల్లో గ్రామానికి 10 నుంచి 20 కుటుంబాలకు ఆస్తి నష్టం జరిగిందన్నారు. నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటామని, ప్రభుత్వం ద్వారా డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేయిస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. అలాగే కొన్ని గ్రామాల్లో వడగళ్ల వాన వల్ల కోత కోయని వరి ధాన్యం రాలిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. డిచ్‌పల్లి జెడ్పీటీసీ దాసరి ఇందిర, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కృష్ణ, అమీర్ పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య



సమ్మెలో మాట్లాడుతున్న బస్వా లక్ష్మీనర్సయ్య

సుభాష్‌నగర్: ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, వారికి కనీస వేతనం ఇవ్వాలని, న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. తెలంగాణ ఐకేపీ వీవోఏ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ధర్నా చౌక్‌లో మంగళవారం సమ్మె నిర్వహించారు. సమ్మెకు బస్వా లక్ష్మీనర్సయ్య, దినేష్ కులాచారి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీవోఏలకు రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, గౌరవ వేతనం డీఆర్‌డీఏ అకౌంట్ నుంచి నేరుగా వీవోఏల ఖాతాల్లో జమ చేయాలని పేర్కొన్నారు. జీవోనెంబర్–58ని సవరిస్తూ మూడేళ్లకొకసారి పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన వారికి సీసీలుగా ప్రమోషన్లు ఇవ్వాలని, జాబ్ చాట్ డిక్లరేషన్ ప్రకటించాలని కోరారు. కరోనా సమయంలో చనిపోయిన వీవోఏ కుటుంబాలకు రూ.10లక్షల ఆర్థికసాయం చేయాలని, తదితర డిమాండ్లు పరిష్కరించాలన్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళతో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు. డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న, నాయకులు విద్యాసాగర్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి, జగన్‌రెడ్డి, యూనియన్ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల చిట్టా బయట పెట్టాలి



సిరికొండ: దళితబంధు లబ్ధిదారుల వద్ద లంచం తీసుకున్న ఎమ్మెల్యేల చిట్టా తన వద్ద ఉందని ప్రకటించిన సీఎం కేసీఆర్ ఆ పేర్లను బయట పెట్టాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ డిమాండ్ చేశారు. దళిత బంధులో లంచం తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండల కేంద్రంలో తహసీల్దార్ గఫార్‌మియాకు బీజేపీ నాయకులు వినతిపత్రం మంగళవారం అందజేశారు. అలాగే ఎమ్మెల్యేలపై, వారి అనుచరులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, ఎస్సీ మోర్చా మండలాధ్యక్షుడు శంకర్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని గాయత్రినగర్‌కు చెందిన నల్లూరి(28) ఈ నెల 30న అదృశ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మార్చి 30న ఉదయం 4 గంటలకు బాన్సువాడలో తన మిత్రుని ఇంటిలో పండుగ ఉందని చెప్పి వెళ్లి తిరిగి రాలేదని, సెల్‌ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ వస్తుందని తెలిపారు. భార్య పూజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వివరాలు తెలిస్తే 8712659840కు తెలియజేయాలన్నారు.

‘తప్పుడు చిరునామా’పై చర్యలు తీసుకోవాలి



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్ : ప్రభుత్వ అధికారులకు తప్పుడు చిరునామా ఇచ్చి తప్పుదోవ పట్టించిన యువకుడిపై చర్యలు తీసుకోవాలని దేవాలయ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రసాద్ డిమాండ్ చేశారు. నగరంలోని రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో పెళ్లి కోసం దరఖాస్తు చేసుకున్న లవ్ జిహాద్ జంట గురించి నాలుగు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. ఇదే విషయమై మంగళవారం సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి యువతి పూర్తి వివరాలు అందజేశారు. ఈ సందర్భంగా పటేల్ ప్రసాద్ మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్ట్‌పై పూర్తి విచారణ చేపట్టామని తెలిపారు. యువతి స్వస్థలం నాగ్‌పూర్ అని విచారణలో తేలిందన్నారు. కానీ నకిలీ చిరునామాతో తమది నిజామాబాద్ అని దరఖాస్తు చేసుకున్నట్లు సబ్ రిజిస్ట్రార్ దృష్టికి తీసుకొచ్చారు. నకిలీ చిరునామాతో అధికారులను తప్పుదోవ పట్టించిన యువకుడితోపాటు ఆయన వెనక ఉండి నడిపిస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. హిందూ నాయకులు బంటు ప్రవీణ్, రామరాజు, చైతన్య, ప్రతాప్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

భర్త మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోండి

ఖలీల్‌వాడి: తన భర్తకు మృతికి కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాక్లూర్ మండలం గొట్టిముక్కల గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ, ఎస్‌హెచ్‌వో విజయ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈనెల 1న నిజామాబాద్ ఏసీపీ ఆఫీస్‌లో పని ముగించుకొని తిరిగి వెళ్తుండగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొనడంతో తన భర్త నాగభూషణం(59) తలకు తీవ్రగాయాలయ్యాయని, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారని బాధితురాలు తెలిపారు. రాయల్ ఎన్‌ఫీల్డ్‌తో ఢీకొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

13న సేవా కార్యక్రమాల నిర్వహణ

- ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవి శంకర్ జన్మదినం సందర్భంగా..



మాట్లాడుతున్న వై క్రాంతికుమార్

నిజామాబాద్ సిటీ: ఈ నెల 13న ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ జన్మదిన సందర్భంగా జిల్లా కేంద్రంలో పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్ నిజామాబాద్ జిల్లా టీచర్ క్రాంతికుమార్ తెలిపారు. మంగళవారం ఎల్లమ్మగుట్ట డ్రగ్గిస్ట్ అసోసియేషన్ భవనంలో ఆయన మాట్లాడారు. నగరంలో ఉదయం నుంచి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామని, అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి ఆర్మూర్ రోడ్డు శ్రీ రామా గార్డెన్‌లో జరిగే జన్మదిన వేడుకలకు ప్రఖ్యాత గాయకుడు భూషణ మాల తన బృందంతో రానున్నారని తెలిపారు. సమావేశంలో డీడీసీ సభ్యులు మద్ది రాజు, ఆకుల రమ, రాజ్‌కుమార్ సుబేదార్, మీసాల శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్ట్ ప్రణాళిక విప్లవ పార్టీలకు కరదీపిక

ఖలీల్‌వాడి: కార్ల్ మార్క్స్ రాసిన కమ్యూనిస్ట్ ప్రణాళిక విప్లవ పార్టీలకు నేటికీ కరదీపికగా మారిందని సీపీఎంఎంఎల్ ప్రజా పంథా రాష్ట్ర నాయకులు ప్రభాకర్ అన్నారు. మంగళవారం కోటగల్లిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్ల్ మార్క్స్ జయంతి(మే 5) సందర్భంగా దేశంలో 4 కమ్యూనిస్ట్ పార్టీలు కలకత్తా మహా నగరంలో ‘సెమినార్’లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, పంజాబ్, బెంగాల్ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొననున్నారని తెలిపారు. భారతదేశంలో 100 సంవత్సరాలుగా కమ్యూనిస్టు పార్టీలు మార్క్స్ శాస్త్రీయ సిద్ధాంతాన్ని అవగాహన చేసుకోవడంలో, ఆచరించడంలో, ప్రజానీకానికి మార్క్స్ సిద్ధాంతాన్ని కూడా పరిచయం చేయలేని స్థితిలో కమ్యూనిస్టు పార్టీలు ఉండడం విచార కరమన్నారు. ఇలాంటి స్థితిలో కమ్యూనిస్టు పార్టీలకు ‘సెమినార్’ స్ఫూర్తి కలిగించే మైలు రాయిగా నిలుస్తుందన్నారు. నాయకులు దేవారం, రామకృష్ణ, ముత్తన్న, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లకు అండగా పోరాటాలు చేస్తాం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

నిజామాబాద్‌నాగారం: దేశానికి పతకాలు తెచ్చిన భారత రెజ్లర్లను వేధింపులకు గురి చేసిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌సింగ్‌పై చర్యలు తీసుకునేదాక పోరాటాలు చేస్తామని జాతీయస్థాయిలో బంగారం పతకం సాధించిన సీనియర్ క్రీడాకారుడు సయ్యద్ కైసర్ తెలిపారు. మంగళవారం నగరంలోని శ్రీరామ గార్డెన్‌లో జరిగిన రౌండ్ టేబుల్‌సమావేశంలో వక్తలు మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని మోదీ ఇప్పటి వరకు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. శిక్ష పడే వరకు రెజ్లర్లకు మద్దతుగా ఉంటామన్నారు. ఈ నెల 12న జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అన్ని సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. జమాతే ఇస్లామి ప్రతినిధులు షేక్ హుస్సేన్, ఎంఆర్‌పీఎస్ నేత సిద్ధి రాములు, అంబేడ్కర్ సంఘం నేతలు పాల్గొన్నారు.

బార్ అండ్ బెంచ్ సమన్వయమే కీలకం



జడ్జిలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సభ్యులు

ఖలీల్‌వాడి: బార్ అండ్ బెంచ్‌ల మధ్య సమన్వయం చేసుకొని న్యాయమూర్తులు న్యాయం అందించడానికి శ్రమించాలని నిజామాబాద్ అదనపు జిల్లా జడ్జి కనక దుర్గ అన్నారు. మంగళవారం నూతన జూనియర్ సివిల్ జడ్జిలుగా బదిలీపై వచ్చిన కుష్బు ఉపాధ్యాయ్, గోపి కృష్ణలకు నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. న్యాయసేవలు అందించడంలో బార్ అండ్ బెంచ్ క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. అనుకూల దృక్పదంతోనే ఉండాలని, అనుకూల ఫలితాలను తయారు చేసుకోవాలన్నారు. చట్టాలను భగవద్గీతగా భావించి అధ్యయనం చేయాలని, పవిత్రమైన పనికి ఫలితాలు రాబట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, ప్రధాన కార్యదర్శి భాగి చరణ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యెండల ప్రదీప్, బార్ కార్యవర్గ సభ్యులు సురేష్, బాలరాజ్ నాయక్, సత్యనారాయణ గౌడ్, మానస, న్యాయవాదులు మధుసూదన్ రావు, కిరణ్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సక్రమంగా ఉండేలా సహకరించాలి

- రాజకీయ పార్టీల నేతలతో ఆర్డీవో సమావేశం



డిచ్‌పల్లి: ఓటరు జాబితా సక్రమంగా ఉండేలా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులకు తమ సహకారం అందజేయాలని నిజామాబాద్ ఆర్డీవో రవి కోరారు. మంగళవారం డిచ్‌పల్లి తహసీల్ కార్యాలయంలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ స్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చనిపోయిన, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలసవెళ్లిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించేలా చూడాలన్నారు. అలాగే 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవడంలో, ఓటరు జాబితా సవరణకు సహకరించాలన్నారు.

ఇంటర్‌లో మెరిసిన జిల్లా విద్యార్థులు



కాటిపల్లి కీర్తనరెడ్డి, ఎంపీసీ, 464



విద్యార్థినులను అభినందిస్తున్న కామధేను కళాశాల కరస్పాండెంట్ లింబాద్రి

సాక్షి నెట్‌వర్క్ : ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మెరిశారు. మంగళవారం ఇంటర్ బోర్డు విడుదల చేసి ఫలితాల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. నగరంలోని నారాయణ కళాశాలకు చెందిన శివరాశి కీర్తన ఎంపీసీలో 467 సాధించింది. సిరికొండ మండల కేంద్రంలోని కామధేను జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి బోడ రాఘవి ఎంపీసీలో 968 మార్కులు, బైపీసీలో అన్నారం కావేరి 933 మార్కులు, సీఈసీలో ఆరాధన 881 మార్కులు సాధించారు. అలాగే జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామానికి చెందిన కాటిపల్లి కీర్తనరెడ్డి తన సత్తా చాటింది. ఫస్టియర్ ఎంపీసీ ఫలితాల్లో 470 మార్కులకు 464 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో కీర్తనరెడ్డి చదువుతోంది. కీర్తనరెడ్డి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముస్కు సాయరెడ్డి, సర్పంచ్ సాయరెడ్డి అభినందించారు.

ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల హవా



ధర్మారం(బి) గురుకుల కళాశాల విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సంగీత, అధ్యాపకులు

సాక్షి నెట్‌వర్క్ : ఇంటర్ ఫలితాల్లో మోపాల్ మండలం కంజర్ శివారు గురుకుల కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. బైపీసీలో అక్షిత 973, ఎంపీసీలో వందన హనీ 972 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు. డిచ్‌పల్లి మండల ధర్మారం గురుకుల కళాశాల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణ సాధించారు. బైపీసీలో సింధు 986 మార్కులు, ఎంపీసీలో కీర్తన, సిరివెన్నెలలు 984 మార్కులు సాధించారు. అలాగే ఫస్టియర్‌లో ఎంపీసీలో ముగ్గురు విద్యార్థులు 463 మార్కులు, బైపీసీలో నందిని 433 మార్కులు సాధించారు. డిచ్‌పల్లి కేజీబీవీకి చెందిన విద్యార్థులు కూడా ప్రతిభ చూపారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ విభాగంలో బి.రోజా 452 మార్కులు, సెకండియర్‌లో ఎంపీసీలో శ్వేత 952 మార్కులు సాధించారు. ధర్పల్లి ఆదర్శ కళాశాలలో ఫస్టియర్‌లో 51 శాతం, సెకండియర్‌లో 88 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో దేవిశ్రీ 983 మార్కులు, బైపీసీలో సానియా 971 మార్కులు సాధించారు. జక్రాన్‌పల్లి మోడల్ కళాశాలలో సెకండియర్‌లో 52 శాతం, ఫస్టియర్‌లో 43 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో మణిదీపిక 964 మార్కులు, బైపీసీలో అంబటి శషశ్రీ 974, సీఈసీలో మానస 829 మార్కులు, ఎంఈసీలో గాయత్రి 909 మార్కులతో మొదటి స్థానంలో నిలిచారు. ఫస్టియర్ ఎంపీసీలో మనోజ్ఞ 425 మార్కులు, బైపీసీలో ఇంద్రజ 356మార్కులు, సీఈసీలో శ్రావణి 433 మార్కులతో మొదటి స్థానంలో నిలిచారు.



దేవిశ్రీ ఎంపీసీ, 983, ధర్పల్లి ఆదర్శ కళాశాల



సానియా, బైపీసీ, 971, ధర్పల్లి ఆదర్శ కళాశాల



అంబటి శషశ్రీ, బైపీసీ, 974, జక్రాన్‌పల్లి మోడల్ కళాశాల



మణిదీపిక, ఎంపీసీలో 964, జక్రాన్‌పల్లి మోడల్ కళాశాల

సీఐటీయూ నుంచి బీఎల్‌టీయూలోకి చేరికలు



బీడీ టేకేదార్‌లతో సిద్ధిరాములు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల కేంద్రం ఠాకూర్ సాదేకర్ బీడీ సెంటర్ పరిధిలో వివిధ గ్రామాల బీడీ టేకేదార్‌లు, కార్మికులు మంగళవారం సీఐటీయూ నుంచి బీఎల్‌టీయూలో చేరినట్లు బీఎల్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు తెలిపారు. ఈ సందర్భంగా సిద్ధిరాములు మాట్లాడుతూ.. బీడీ టేకేదార్‌లు, కార్మికుల సమస్యల పట్ల రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. యూనియన్‌లో చేరిన వారిలో టేకేదార్‌లు జ్ఞానేశ్వర్, ముత్తేష్, లక్ష్మణ్, నర్సయ్య, ప్రసాద్, గంగాధర్, నర్సయ్య ఉన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,500	వెండి (కిలో)	78,000
22 క్యారెట్స్	57,627	- నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	క్యాప్సికం	30	50
బెండకాయ	25	40	గాజరుగడ్డ	20	30
జీరకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
దొండకాయ	20	40	దోసకాయ	15	30
బీర్నీసుకాయ	50	70	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	20	40	గోబిపువ్వు	20	40
పాలకూర	20	40	బీట్‌రూట్	20	40
మెంతికూర	40	60	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	40	60
పుదీనా	40	60			

- ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు	డ్రెస్డ్	220
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)
స్క్రీన్–1– ఉగ్రం–10.30
విరూపాక్ష –1.15,10.35
రామబాణం –4.30
పొన్నియిన్ సెల్వన్–2– 7.25
స్క్రీన్–2– గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ– 10.30 ,10.20
పొన్నియిన్ సెల్వన్–2 –1.30
ఉగ్రం –4.40,7.25
స్క్రీన్–3 –రామబాణం–10.30,7.30,10.30
గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ–1.20,4.25
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్–1– గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ(ఇంగ్లిష్) 3.15,6.30,9.45
స్క్రీన్–2– ఉగ్రం–10.00,4.15,10.30
రామబాణం –1.10,7.25
స్క్రీన్–3–ది కేరళ స్టోరీ(హిందీ),10.00,1.00 4.00,7.00,10.00
స్క్రీన్–4– ఇంగ్లీష్ మంజు(తెలుగు) 10.00
యాదగిరి అండ్ సన్స్–1.25
అరంగేట్రం–4.00
పొన్నియిన్ సెల్వన్–2,6.50 ,10.20
దేవి పొన్నియన్ సెల్వన్ 2
నటరాజ్ ఉగ్రం
లలితామహల్ రామబాణం
విజయ్ విరూపాక్ష